# ఇద్దరు వినాయకుల కథ

"భజగోవిందంగారు మీరేనా?" అనడిగాడు నేను తలుపు తియ్యగానే. మా కాలనీలో మనిషే అని గుర్తుపట్టాను. ఫైల్లోంచి ఒక లిస్టు తీశాడు. ''వినాయక చవితి చందా సార్! ఎ- టైపు క్వార్టర్స్‌లో వున్నారుగా, ఆరు రూపాయలివ్వండి'' అన్నాడు.

లిస్టు చూసి చాలా ముచ్చటపడ్డాను. సన్‌లిట్ బాండ్ పేపరుమీద టైపు చేసేరు. సీరియల్ నెంబరు నల్లగా, క్వార్టర్ నెంబరు ఎర్రగా, ఉద్యోగి పేరు నల్లగా, కట్టవలసిన చందా ఎర్రగా, ఆఫీసు వర్కు అంత శ్రద్ధగా చెయ్యడం చూడం.

"నిన్ననే భీమారావుగారికి స్వయంగా ఇచ్చాను" అన్నాను.

"మేం భీమారావు యూనియన్ కాదండి, సుబ్బారావుగారి యూనియన్. వాళ్ళ వినాయకుడు కాలనీ చివర స్కూలు కాంపౌండులో తడికెల షెడ్‌లో. మా వినాయకుడు రోడ్డుమీద క్లబ్ హౌసులో-"

"ఐసీ. ఈ సారికి దాంట్లో ఇచ్చానుగా, వచ్చేసారి మీ దాంట్లో కడతాలెండి."

"అయితే ఇవ్వనంటారా?" అని అందులో బెదిరింపు లేనట్టే చూసి లిస్టు మూశాడు. 'దైవపూజ ఒకచోట చేస్తే చాలుకదా?' అన్నాను నవ్వు తెచ్చి పెట్టుకుంటూ.

'నమస్కారం సార్' అని వెళ్ళాడతను. పదిఅడుగులు వెళ్ళాడో లేదో- ఇంతసేపూ అతని కూడా వుండి నోరు మెదపని ఆయన వెనక్కొచ్చి "ఇచ్చేయండిసార్! సిక్స్‌రుపీస్ అంటే మీకు పెద్ద కష్టం కాదు. బేసిక్‌పే పన్నెండు వందలు దాటిందిగా" అన్నాడు.

"ధరలు కూడా అంతకుమించి పెరిగాయిగా" అన్నాను.

"కొత్తగా వచ్చేరు. మీకు తెలీదు, ట్రబుల్ పడిపోతారు. ఆపైన మీ ఇష్టం" అని వెళ్ళాడు.

సూర్యారావు చెప్పాడు. "సుబ్బారావు యూనియన్ అడిగిన చందా ఏదైనా సరే, ఆలోచించకుండా మారు మాట్లాడకుండా ఇచ్చెయ్యడమే రైటు. వాళ్ళు కసి పెట్టుకుంటే మర్నాటి ఉదయంనుంచీ నీళ్ళు రావు. ఇంటెదుట పోగుపడే చెత్త క్లియర్ చెయ్యరు. పోస్టుమాన్‌ని బెదిరించి ఉత్తరాలు కాజేస్తారు.

"సుబ్బారావుగారు నా క్లాస్మేటు. ఆయనతో చెబుతాను యూనియన్ అంటే ఉద్యోగుల సంక్షేమం చూడాలిగాని గూండా యిజంకి దిగడం కాదుగా, పోనీ నేను చందా యివ్వననలేదే, వచ్చేసారి వీళ్ళకే యిస్తానన్నాను."

"చూసుకో, నాకేం!"

రెండు యూనియన్లున్నాయి, రెండు రాజకీయ పార్టీలవి. రెండింటిదీ భౌతిక వాదమే. దేవుడూ గీవుడూ జాంతానై, మనుషులు; చెమటా, కష్టం అంటాయి. రెండూ పెట్టుబడిదారీ జులుం నశించా లంటాయి. లాభాలలో కార్మికులకి వాటా, యాజమాన్యంలో యూనియన్‌లకి ప్రాతినిధ్యం అంటాయి. ఆ ప్రాతిపదిక మీదనే సుబ్బారావుగారూ, భీమారావుగారూ కూడా మా కంపెనీ సలహా సంఘంలో సభ్యులయ్యారు.

సుబ్బారావుగారితో మాట్లాడదామని వారి ఆఫీసుకి బయలు దేరాను. దార్లో భీమారావుగారు కనిపించారు. నన్ను చూసి కారు ఆపు చేశారు. "ఏం సార్! కులాసా? ఎట్లా వుంది ఉద్యోగం? క్వార్టర్స్ సదుపాయంగా వుందా? మీకు అవుటాఫ్ టర్న్‌లో ఆక్వార్టర్స్ ఇప్పించే సరికి నా తలప్రాణం తోక కొచ్చింది!" అని పలకరింపో, మంద లింపో తెలీకండా మాట్లాడాడు.

"అది సరే; వినాయకుడి చందా మీకు ఇచ్చాను కదా; మరి సుబ్బారావుగారి మనుషులు వొచ్చి వాళ్ళకూడా ఇవ్వాలంటారేం? పైగా,

ఇవ్వకపోతే ట్రబులు పడిపోతారు అని వార్నింగ్ ఇచ్చి వెళ్ళారు. ఇచ్చేయ్యనా, చందా?" అన్నాను.

'ట్రబులేమిటి; వాళ్ళ మొహం!' అన్నారే కాని, భీమారావుగారికి తన మాటమీద తనకే నమ్మకం లేనట్టు. వెంటనే- "ట్రబులంటే ట్రబులే మరి. చెప్పలేం! మీ కాలనీ పంపు డ్రైవరు, ప్లంబరు, శానిటరీ మేస్త్రి, ఎలెక్ట్రిక్ మీటర్ రీడరు అందరూ ఆ యూనియన్ మెంబర్లు. కాని మీరొక అడ్వాన్స్ కంప్లెయింట్ ఇవ్వండి, వాళ్ళమీ తోక జాడించ కండా ఏర్పాట్లు చేద్దాం" అన్నారు. పరిస్థితి నాకర్థమైపోయింది.

కంప్లెయింట్ రాస్తే 'ఎల్లుండి వాళ్ళు నన్ను హింసిస్తారేమోనని భయంగా వుంది' అని వెర్రివెంగళప్పలా రాయాలి, క్రింద సంతకం పెట్టాలి. 'నువ్వా, మా మీద కంప్లెయింట్ రాసేది?' అని వాళ్ళు నిజంగా కసి పెట్టుకోవచ్చు. ఇంతకంటె చందా కట్టెయ్యడం సుఖం....

"ఏమిటో- సకల మతాలూ కూడా దైవం వొక్కడేనని చెబుతాయి. మా కాలనీలో మాత్రం ఇద్దరు దేవుళ్ళు.... ఈ వినాయకులను ఆడించే నాయకులు దేవుడు లేడనీ, మనిషే కష్టపడుతున్నాడనీ, రాడికల్‌గా మాట్లాడతారు!" అన్నాను నవ్వి.

"భలేవారే, మా కామాత్రం తెలీదనుకున్నారేమిటి ? కాని యూనియన్ మెంబర్లందరూ దైవభక్తులు. వాళ్ళ ప్రయివేటు నమ్మకం మాకు శిరోధార్యం. కనుక దేవీ నవరాత్రులు, వినాయక నవరాత్రులు, శ్రీరామనవమి నవరాత్రులూ చెయ్యడానికి ప్రోత్సహిస్తాం. చందాలివ్వని వాళ్ళమీద చర్య తీసుకోడానికి మళ్ళీ ప్రపంచమార్గం, సంఘటిత శక్తి వాదం అవలంబిస్తాం" అని సెలవిచ్చారు భీమారావుగారు.

"చక్కగా చెప్పారు. ఇంక దసరా మామూళ్ళు ఇవ్వడానికి ఏడుపు రాదు" అన్నాను.

"అదేం?"

"అవి సరాసరి వ్యక్తులకు వెళతాయి కనక."

(8-9-79)